www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024
5
అన్నమయ్య



నేడు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 10న సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి రాగలరని తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు.

సమరశీల పోరాటాలకు ప్రతీక సిఐటియు

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమరశీల పోరాటాలకు ప్రతీక సిఐటియు అని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం)రాష్ట్ర ప్రెసిండెంట్ కె. నాగభూషణం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ వర్కర్ల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గడిచిన 55 సంవత్సరాల కాలంలో వివిధ రకాల కార్మికులకు సంఘాలు పెట్టి వారి హక్కులను చట్టాల అమలుకు నీతి నిజాయతీ, క్రమశిక్షణలతో పోరాడుతుందని తెలిపారు. గత డిసెంబర్‌లో మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఆప్కాస్ రద్దు చేయాలని సమ్మెలో మొదటి అడుగు వేసి చివరి వరకు జిఒల సాధనకు పోరాటం చేసిన సంఘం సిఐటియు అని కొనియాడారు. అంగన్వాడీ, ఆశా, సంఘామిత్ర, ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు నాయకత్వం వహించడమే గాక ప్రభుత్వాన్ని ఇంటికి పంపడంలో సిఐటియు క్రియాశీలక పెద్దన్న పాత్ర పోసించిందని అన్నారు. పెట్టుబడిదారి ప్రభుత్వాలను కూల్చి కార్మిక వర్గ రాజ్య స్థాపన చేయడమే ధ్యేయంగా సిఐటియు పని చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సిఐటియు విస్తరణకు నడుం బిగించాలని కోరారు. సిఐటియు విధానాలు నచ్చడంతో 28 మంది మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు స్వచ్ఛందగా చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు పి. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు మాట్లాడుతూ చేరిన వారిని అభినందిస్తూ మీకు ఆర్థిక, సామజిక భద్రత కోసం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు రకాల లేబర్ కోడ్‌లు రద్దు అయేంత వరకు సిఐటియు పోరాడి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సిఐటియులో కార్మికులు బివి రమణ శంకరయ్య,చంద్రశేఖర్,ఈశ్వర్ రెడ్డి ప్రభాకర్, మహేష్, వెంకటలక్ష్మి ,మౌనిక చిన్నిమ్మి,రమేష్ బాబు,ఈశ్వరమ్మ సావిత్రి ,యశోద, గిరి,నాగసుబ్బులు శంకర, షఫీ,సురేష్,అంజి, నాగేశ్వరి పురుషోత్తం, జయరాం, పార్థసారధి రెడ్డి, పాల్గుణ,రాఘవ, నాగరాజు మధుకర్ చేరారు. వారు మాట్లాడుతూ సిఐటియు విధా నాలు అనుకరిస్తూ పోరాటాలు పెరుగుదలకు కృషి చేయడంతో పాటు సంఘం మరింత బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. ఓబుశమ్మ, మున్సిపల్ జిల్లా నాయకులు లక్ష్మిదేవి, ప్రసాద్, రమణ, పెంచలయ్య, సాలమ్మ, రవిశంకర్, చెన్నయ్య, రాంబాబు, వై.వెంకటరమణ, కేశమ్మ సుభాషిణి, ఉమా మహేశ్వరీ, ఆంజనేయులు, కేశమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం



పారిశుధ్య కార్మికుడిని సిఐటియులోకి ఆహ్వానిస్తున్న నాయకులు

మదనపల్లె అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆమదనపల్లె ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ఆదివారం పట్టణంలోని సిఎస్ఐ జెసిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సునీల్ వరకుమార్, సెక్రటరీ జేఈ భక్తవత్సలం, ట్రెజరర్ ఆనంద్, ఇతర కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు షాజహాన్ భాష ఉదయం ప్రత్యేక ప్రార్ధనలకు హాజరయ్యారు. ఈ మేరకు చర్చి పాస్టర్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తనను ఆదరించి ఓట్లు వేయడం తోనే గెలుపొందానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని భాద్యతగా పని చేసి మదనపల్లె అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ మేరకు ఓటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘస్థులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చర్చి పెద్దలు

నీటి కుంటలో పడి విద్యార్థి దుర్మరణం

- ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వట్టణంలోని అలిమాబాద్ వీధిలో విషాదం చోటు చేసు కుంది. నీటి కుంటలో పడి విద్యార్థి అద్నాన్ (15) అనే బాలుడు ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని అలిమాబాద్‌లో నివాసముంటున్న షకీల్ టైలర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆదివారం కావడంతో కుటుంబ సభ్యులతో కలసి పట్టణ పరిధిలోని వీరబల్లి మండలంలో ఉన్న పుల్లగూర గండికి విహార యాత్రకు వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అద్నాన్ ప్లేటు కడగడానికి నీటి కుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయాడు. కాసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న అద్నాన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతితో అలిమాబాద్ వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇంట్లో పెద్ద కొడుకు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన అద్నాన్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

జిజిహెచ్‌కు సూపరింటెండెంట్ కావలెను!



- 10 రోజులు దాటుతున్నప్పటికీ సెలవులోనే..
- ఎఫ్ఎసి సైతం ఇవ్వకుండా వెళ్లిన వైనం
- ఫిర్యాదులు..వివాదాలతో కొరవడిన పర్యవేక్షణ
- పోలీసు పంచాయితీ వరకు వెళ్లిన ఉద్యోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రికి సమర్థ సూపరింటెండెంట్ అనివార్యమనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుత జిజిహెచ్ సూపరింటెండెంట్ ఆమె కుమారుడు అమెరికా నుంచి వస్తున్న నేపథ్యంలో 10 రోజుల కింద సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. 10 రోజులు దాటితే జిజిహెచ్ బాధ్యత నిర్వహణను డిప్యూటీ సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారులకు ఫుల్ అడిషనల్ ఛార్జి (ఎఫ్ఎసి) అప్పగించి వెళ్లాల్సి ఉంది. ఈమేరకు సీనియర్ అసిస్టెంట్ కలెక్టర్‌కు ఫైలు నడిపి కలెక్టర్ దృష్టిలో సెలవు పెట్టిన విషయాన్ని ఉంచాల్సి ఉంది. ఇటువంటి ప్రయత్నం చేయని నేపథ్యంలోనే జిజిహెచ్ కార్యాలయ ఉద్యోగుల మధ్య విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి చేరుకున్నాయి. వివాదాలు..ఫిర్యాదులు..దాడులు..ఎన్‌జిఒ సంఘాల నాయకులు, పోలీస్‌స్టేషన్ వరకు విభేదాల వ్యవహారం చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని నెలల తరబడి ఉద్యోగుల మధ్య విబేధాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా జిజిహెచ్ పర్యవేక్షణ కొరవ డింది. నిత్యం వందలాది మంది రోగులతో కిటకిటలాడుతున్న జిజిహెచ్ పనితీరును గాలికి వదిలేయడమేమిటనే చర్చ నడుస్తోంది. కొన్ని నెలల కిందట డిప్యూటీ డైరెక్టర్ (డిడి)పై కార్యాలయ ఉద్యోగులు పోలీసులకు రెండు దఫాలుగా ఫిర్యాదులు చేయడం, విచారణలు చేపట్టడం తెలుస్తోంది. తాజాగా ఓ కంపాసినేట్ అపాయింట్ మెంట్, స్పౌస్ నిర్ధారణ అంశాల్లో ఉద్యోగుల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు రావడం, చిలికి చిలికి విభేదాలు గాలివానగా మారడంతో ఇటీవల డిప్యూటీ సూపరింటెండెంట్‌కు డిడిపై ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ సూపరింటెండెంట్ జోక్యం చేసుకుని ఇరువురిని మందలించి సర్దుబాటు చేసినట్లు సమాచారం. అనంతరం అంతటితో ఆగకుండా ఓ ఆఫీసు సూపరింటెండెంట్‌పై బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో సదరు సూపరింటెండెంట్ తనకు రక్షణ కల్పించాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడం, ఎన్‌జిఒ సంఘాల నాయకులు మధ్యవర్తిత్వం నెరపుతుండడం చర్చనీ యాంశంగా మారింది. కొన్ని నెలల తరబడి ఉద్యోగుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుని పోలీస్ కేసుల వరకు పరిస్థితి వెళ్తుంటే జిజిహెచ్ సూపరింటెండెంట్ ఏమి చేస్తున్నారనే విమర్శలు జోరు వెల్లువెత్తుతోంది.

ఎఫ్ఎసి ఇవ్వలేదు..

జిజిహెచ్ సూపరింటెండెంట్ సెలవుపై వెళ్లిన మాట వాస్తవమే. కానీ తనకు ఎఫ్ఎసి బాధ్యతల్ని ఇవ్వలేదు. మంగళవారంతో సూపరింటెండెంట్ 10 రోజుల సెలవు పీడియడ్ ముగియనుంది. ఈనేపథ్యంలో మరో మూడు రోజులు విధులకు హాజరు కాలేనని సమాచా రం అందించారు.

- సురేశ్వరరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, జిజిహెచ్, కడప.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజ

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

జీవో నెంబర్ 117 రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలని పాఠశాలల విలీనం రద్దు చేయాలని, విద్యా రంగం సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ కొత్త ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రాయచోటిలోని స్థానిక డైట్ సమావేశ మందిరంలో నిర్వహించి జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్ మాట్లాడుతూ తెలుగు మీడియం పునరుద్ధరించాలన్నారు. తిరోగమన దిశలో ఉన్న విద్యారంగం పైన ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని కోరారు. మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ మెడికల్ బిల్లులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం వైపు కాస్త దష్టి సారించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం నూతన ప్రభుత్వానికి వారు శుభాకంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, సహాధ్యక్షులు శివారెడ్డి, హేమలత, కోశాధికారి చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శులు రమణ మూర్తి, పురం వెంకట రమణ,ఆది నారాయణ, శ్రీధర్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, పూర్వ జిల్లా కార్యదర్శి గంగా దేవి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సహకరించిన వారికి ధన్యవాదాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లా అభివృద్ధికి సహకరించిన జిల్లా పరిషత్ సభ్యులందరికీ మాజీ జడ్‌పి చైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఆకేపాడు గ్రామ పంచాయతీ తన ఎస్టేట్లో ఆదివారం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా ప్రజా పరిషత్ సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ ఉద్యోగుస్తులతో ఆత్మీయ వీడ్కోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాలు జిల్లా అభివృద్ధికి వారి సహాయ సహకారాలు మరవలేనని అన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు ,అభివృద్ధికి ఎంతో కృషి చేశామని ఆయన అన్నారు. ఇకమీదట కూడా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారం చేసేదానికి కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా పరిషత్త్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


కడపలో మొదటి సారిగా

ఎపిఎల్ సీజన్-3 క్రికెట్ మ్యాచ్‌లు

- ఈనెల 30 నుంచి జూలై 3వ తేదీ వరకు నిర్వహణ
- స్టార్ స్పోర్ట్స్-1, స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం
- అందరికీ ఉచిత ప్రవేశం
- జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్

ప్రజాశక్తి - కడప

కడపలో మొట్టమొదటిసారిగా ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఏర్పాటుచేసిన ఫెడ్‌లైట్స్ కాంతులలో ఈనెల 30 నుంచి జులై 3 వరకు నాలుగు రోజులపాటు ఎన్నడూ లేని విధంగా ఎపిఎల్ (ఆంధ్ర ప్రీమియం లీగ్) సీజన్-3 టి- 20 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఎపిఎల్ సీజన్-3 క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ, ఏర్పాట్లపై ప్రజాశక్తితో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పలు విషయాలను తెలిపారు. ఎపిఎల్ సీజన్-1, సీజన్-2 మ్యాచ్‌లు గతంలో వైజాగ్‌లో నిర్వహించారని చెప్పారు. ఇప్పుడు ఏపిఎల్ సీజన్-3 క్రికెట్ మ్యాచ్‌లను కడప, వైజాగ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎపిఎల్ సీజన్ -3 మ్యాచ్‌ల ప్రారంభ కార్యక్రమం ఈనెల 30న కడప లోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఉంటుందన్నారు. ప్రారంభ రోజు ఒక మ్యాచ్ ఉంటుందని వారు తెలిపారు. తరువాత జులై 1,2,3 తేదీలలో మూడు రోజుల పాటు ఒక్కో రోజు రెండు మ్యాచ్‌లు(డే అండ్ నైట్) ఫెడ్ లైట్స్ కాంతులలో ఉంటాయని పేర్కొన్నారు. మొత్తం 7 మ్యాచ్‌లు లీగ్ పద్ధతిలో జరుగుతాయని వారు తెలిపారు. తర్వాత మ్యాచ్‌లు వైజాగ్‌లో ఉంటాయన్నారు. మొత్తం 6 జట్లు పాల్గొంటు న్నాయని చెప్పారు. కోస్టల్ రైడర్స్, రాయలసీమ కింగ్స్, ఉత్తరాంధ్ర లయన్స్, బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్, వైజాగ్ వారియర్స్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని వివరించారు. మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాన్ని స్టార్ స్పోర్ట్స్ -1, స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానళ్లలో వీక్షించవచ్చునన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను చేసినట్లు వారు తెలిపారు. కడప నగర, జిల్లా ప్రజలకు, క్రికెట్ అభిమానులకు అందరికీ ఉచిత ప్రవేశం కల్పించామన్నారు. మొట్ట మొదటిసారిగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఫెడ్ లైట్స్ కాంతులలో కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఏపీఎల్ సీజన్ - 3 మ్యాచ్లు నిర్వహించడం ఓ గొప్ప సువర్ణ అవకాశంగా భావిస్తున్నట్లు చెప్పారు. మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.



ఫ్లడ్‌లైట్ వెలుగులో క్రికెట్ స్టేడియం



రెడ్డి ప్రసాద్ భరత్‌రెడ్డి

వైసిపి అక్రమాలను వెలికి తీస్తాం

- సహకరించిన అధికారులూ బాధ్యులే
- పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు/కలికిరి

వైసిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపడుతామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. పీలేరు నియోజకవర్గం, కలికిరి మండలం, నగరి పల్లెలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తాజా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వారి అనుచరులు చేసిన భూ కబ్జాలు, అక్రమ ఇసుక, మట్టి, గ్రానెట్ తరలింపు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినవారు, సహజ వనరుల్ని దోచుకున్న వారు, వారికి సహకరించిన అధికారులపై కూడా విజిలెన్స్, సిబిఐ విచారణలు చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీలేరు పట్టణ శివారులో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పీలేరు నియోజకవర్గ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువత, కార్మికులకు ఉపాధి కల్పన కోసం రైతుల నుంచి వందలాది ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారని తెలిపారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీలేరు పరిధిలో రూ.400 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల్ని వైసిపి శ్రేణులు తమ ఇష్టారాజ్యంగా కబ్జాలు చేసుకుని అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. వైసిపి ఎంపీ, తాజా మాజీ ఎమ్మెల్యేల సహకారంతో స్థానికంగా హైవే నిర్మాణానికి అవసరమైన మట్టిని సమీప చెరువులు, కుంటలు, గుట్టల నుంచి గుత్తేదారులు సేకరించారని తెలిపారు. అది ఎవరి అనుమతులతో సేకరించారో కూడా నిగ్గు తేలుస్తామని చెప్పారు. అనుమతులు లేని ప్రయివేట్ లేఅవుట్లు, పేదల పేరు చెప్పి ప్రభుత్వం ఇష్టానుసారంగా లేఅవుట్లు వేసి, వైసిపి శ్రేణుల జేబులు నింపడానికి వేసిన లేఔట్లపై కూడా విజిలెన్స్, సిఐడి విచారణలు చేపడుతామని చెప్పారు. పీలేరు నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ భూమి ఒక్క అడుగు కూడా వదలకుండా తిరిగి తమ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలు, ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామని అన్నారు. ఈ నెల12న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, పీలేరు నియోజకవర్గ పరిధిలో జరిగిన అక్రమాల్ని వెలికితీసి అందరిపై గట్టి చర్యలు తీసుకుంటామని మీడియాకు వివరించారు. పీలేరు నియోజకవర్గం టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు, మహిళలు, అనుబంధ సంఘాలు సార్వత్రిక ఎన్నికల్లో తమకు సహకరించి ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి



అచ్చెన్నాయుడిని సన్మానిస్తున్న రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్

అచ్చెన్నాయుడికి అభినందనలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆంధ్రప్రదేశ్ టిడిపి అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడును రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవశ్రీధర్, రూపానందరెడ్డి తనయులు ముక్కా విశాల్‌రెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైల్వే కోడూరు నియోజకవర్గంలో అరవ శ్రీధర్ ను ఎమ్మెల్యేగా గెలిపించి కూటమికి బహుమతిగా అందజేసి తన మాట నిలబెట్టుకున్నానని అన్నారు.కార్యక్రమంలో నరసింహారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణకు ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని నివాసమున్న పెయింటర్ లక్ష్మీనారాయణకు వైద్య ఖర్చుల కొరకు బి.కొత్తకోట హార్డ్ వేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు.గత కొన్ని రోజుల క్రితం తన కాలును తొలగించడంతో తన ఆర్థిక పరిస్థితిని గమనించిన అసోసియేషన్ సభ్యులు మానవత్వం చాటుకొని వారి తరపు నుంచి పదివేల రూపాయలను ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వెంకటరెడ్డి, సకలమూర్తి, ధర్మ, శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్‌టియు నాయకులు

విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో రీజినల్ కన్వీనర్ నరసింహ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 1947, జూన్ 9న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆవిర్భవించిందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ ఎన్నో సమస్యల పరిష్కారాలకు ఉపాధ్యాయుల ప్రయోజనాలను ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తూ తొలి పిఆర్‌సి సాధన నుంచి అంకుటిత దీక్షతో అప్రెంటిషిప్ విధానం పక్కనబెట్టి చాకిరీ నుండి విముక్తి కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ఎస్‌టియు ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కామ్రేడ్ టివి. రెడ్డి స్మారక ఎస్‌టియు భవన్‌లోఅధ్యక్షులు చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్‌టియు నేతలు సమావేశమై సంఘ పతాక ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు ఆర్‌వి. రమణ, కడియాల మురళి, కె. సుబ్బారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, సుధాకర్ రెడ్డి, గుట్టంకొండ నరసింహులు, బాచే లక్ష్మీపతి, బి. భూపతి పాల్గొన్నారు.



రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

'మండిపల్లి'కి సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని చిత్తూర్ రోడ్ లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధిలో నడిపిస్తానని అన్నారు వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిసి రైతులు పంటలు బాగా పండించుకుని అధిక లాభాలు వచ్చేలా ఉండాలని అమ్మవారికి పూజలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివారెడ్డి, అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కిషోర్‌చౌదరి, మండిపల్లి అభిమానులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.3 లక్షలు విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి వీరాంజనేయ స్వామి క్షేత్రానికి విచ్చేయు భక్తులకు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బెంగళూరు వాస్తవ్యులు నాయని శ్రీనాథరెడ్డి, సతీమణి హరితరెడ్డి, కుమారులు హర్షిత్‌రెడ్డి, కృతిక్‌రెడ్డి రూ.3,00,116 విరాళం అందజేశారు. బెంగళూరు నుండి చక్రాయపేట ఏపీజీబీ దేవస్థానం ఖాతాకు జమ చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి తెలిపారు. గండి నిత్యాన్నదాన కార్యక్ర మానికి ఆకర్షితులై శనివారం రూ.3 లక్షల విరాళం ఇచ్చిన సురేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి మిత్రులిరువురు విరాళం పంపడం విశేషం. విరాళాలు అందించే భక్తులకు గండి క్షేత్రం అధికారులు చక్రాయపేట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో 910 634 38 863 ఖాతా నెంబర్‌కు జమ చేయగలరని ఎసి కోరారు. ఐఎఫ్‌సి కోడ్ ఏపీజీబీ0002074 అని తెలిపారు. ఖాతాకు విరాళం జమ చేసిన తర్వాత 94404 29449 నెంబర్‌కు ఫోన్ చేసి వారి వివరాలు తెలియజేయాలని కోరారు. రాష్ట్రంలో తిరుమల వెంకటేశ్వర స్వామి వద్ద నిత్యాన్నదానం ఎలా కొనసాగుతున్నదో అలా గండి క్షేత్రంలో కూడా కొన సాగించడానికి సహకరించిన తాతలకు పేరుపేరునా ఆయన కృతజ్ఞతా భినందనలు తెలిపారు.

మనస్సు దోచుకొంటున్న టెర్రకోట మట్టి బొమ్మలు

- సృజనాత్మకతకు ఆధునిక హంగులు
- ఆకట్టుకుంటున్న కుమ్మరుల ప్రతిమలు



అద్భుతంగా రూపొందించిన కళారూపాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తరాలుగా కొనసాగుతూ వస్తున్న కుల వృత్తికి సృజనాత్మకతతో, ఆధునిక హంగులను జోడించి కుమ్మరులు రాణిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, తమ ప్రతిభ,నైపుణ్యంతో వినియోగ దారుల మనస్సు దోచుకొంటున్నాయి టెర్రకోట మట్టి బొమ్మలు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో ఇప్పటికే కుమ్మరులు సంప్రదాయ కుండల తయారీకి స్వస్తి పలికి సరికొత్త పద్ధతులను అవలంభిస్తూ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకొంటున్నారు. కురబలకోట మండలం అంగళ్లలో నేడు కుమ్మురులు, టెర్రకోట బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా మలుచుకొని జీవనం సాగిస్తూ రాణిస్తున్నారు. సమాజానికి స్ఫూర్తిని నింపి ఆదర్శంగా నిలిచారు. ఇక్కడ ఎదందరికో టెర్రకోట బొమ్మల తయారీలో శిక్షణను అందిస్తూ, సొంతగా రాణించడానికి మార్గ దర్శకులుగా మారారు. జాతీయ రహదారుల వెంబడి వారి తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించడమే కాకుండా స్థానికంగా అమ్మకాలను పెంచుకుంటూ మార్కెటింగులో పురోగతి చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెటింగ్ అవకాశాలు సన్నగిల్లాయని, గతంలో మాదిరిగా వారి స్వయం ఉపాధికి వీలుగా ప్రభుత్వం మార్కెటింగ్ చేసుకోవడానికి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసేదని వారు తెలిపారు. నేడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశం నలుమూలలకు టెర్రకోట బొమ్మల ఖ్యాతిని వ్యాప్తి చేశారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా బొమ్మలు చేయడానికి వీలుగా వీరికి నైపుణ్య శిక్షణను అందించి, సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే మరింతగా రాణిస్తారనడంలో అతిశయోక్తి లేదు. మార్కెటింగ్ సౌకర్యం విస్తరించుకోనేలా ప్రభుత్వం సహకరించాలని వారు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పర్యటించే ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు మట్టి బొమ్మల్లో జీవం ఉట్టి పడే విధంగా తయారు చేస్తున్న విధానాన్ని, కొలువుదీరిన టెర్రకోట బొమ్మలు నాణ్యతపై ప్రశంసించారని అన్నారు. టెర్రకోటకు తిరిగి గత వైభవాన్ని తీసుకొచ్చి మరింత మందికి ఉపాధిని అందించే వృత్తిగా తీర్చి దిద్దడానికి వీలుగా, ముడిసరుకు పనిముట్లు, ప్రభుత్వం రాయితీతో అందించి టెక్నాలజీని వినియోగించు కొనేలా ప్రోత్సహిస్తే మరింతంగా రాణించడానికి వీలుంటుందని అంటున్నారు. మరింత మందికి జీవనాధారం కోసం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆకర్షణీయంగా ఉన్న ప్రతిమలు

'కృష్ణా బోర్డు'ను కర్నూలులో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణా బోర్డు కార్యాలయాన్ని రాష్ట్రానికి తెప్పించి కర్నూలులో ఏర్పాటు చేయాలని కాబోయే ముఖ్యమంత్రి చంద్ర బాబుకు పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం, సెక్షన్ 85 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల్లోపు కృష్ణానది యాజమాన్యపు బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలన్నారు. పదేళ్లయినా ఇప్పటి వరకు కృష్ణానది యాజమాన్యం బోర్డు ఆంధ్రప్రదేశ్‌కు తరలించకుండా హైదరాబాద్‌లోనే ఉంచారన్నారు. కృష్ణానది మీద నిర్మితమైన అన్ని సాగునీటి ప్రాజెక్టుల పరిపాలన నిర్వహణ ఈ బోర్డు పరిధిలోనే అన్నారు. ఇలాంటి అతి ముఖ్యమైన బోర్డు కార్యాలయాన్ని ఎపికి తరలించకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి టిడిపి, వైసిపి ప్రభుత్వాల అసమర్థతకు ఇది మచ్చు తునక అన్నారు. ఈ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని చంద్రబాబు, విశాఖలో ఏర్పాటు చేయాలని జగన్ లేఖలు రాయడం శోచనీయమన్నారు. తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగోడు, పోతిరెడ్డిపాడుతోపాటు పలు సాగునీటి రంగాలకు చెందిన ప్రాజెక్టులు కృష్ణా నది మీద ఉన్న ప్రాజెక్టులు అన్ని శ్రీశైలం రిజర్వాయర్‌కు ఆధారంగా నిర్మితమై ఉన్నాయన్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు సమీపంలోని కర్నూలు జిల్లాలో కానీ, నంద్యాల జిల్లాలో కానీ బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. కృష్ణా నది బోర్డు కార్యాలయాన్ని వెంటనే రాష్ట్రానికి తీసుకరావాలని ఆయన కోరారు.



ఎన్.తులసిరెడ్డి

ఎమ్మెల్యే 'పుట్టా'ను కలిసిన టిడిపి నాయకులు



ఎమ్మెల్యే పుట్టాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మైదుకూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అఖండ మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఖాజీపేట మండల టిడిపి నాయకులు పలువురు పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలతోపాటు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరులో తన నివాసంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొగ్గుల చంద్రఓబుల్‌రెడ్డి, త్రిపురవరం గ్రామ నాయకులు హరినాథ్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిటాల వీరయ్యతోపాటు పలువురు నాయకులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'పుట్టా'ను సన్మానించిన మల్లెపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను మల్లేపల్లి సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి, ఆమె భర్త మల్లెపల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకుడు చిలమల నారాయణ ఆదివారం సన్మానించారు. ప్రొద్దుటూరులోని సుధాకర్ యాదవ్ నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుదని నారాయణ అన్నారు. భవిష్యత్‌లో మఠం అభివృద్ధి కోసం మండల నాయకులు కృషి చేస్తారన్నారు.



సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ చిలమల లక్ష్మీదేవి, నారాయణ



ఆశాజనకంగా కంది పంట

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈ ఏడాది సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉంది. దీర్ఘకాలిక పంటగా రైతులు కంది పంట వేస్తారు. దిగుబడి ఇల్లు చేరాలంటే సుమారు మూడు నెలల వ్యవధి పడుతుందని రైతులు చెబుతున్నారు. కంది సాగు ఎక్కువగా మిశ్రమ పంటగా రైతులు సాగు చేస్తారు. వేరుశనగ, జొన్న, కొర్ర తదితర పంటల్లో మిశ్రమ పంటగా కంది సాగు చేయడం రైతులకు అలవాటు. మిశ్రమ పంట కనుక పెట్టుబడి కూడా పెద్ద సమస్య ఉండదు. బాగా కాపు వస్తే ఎకరాకు రెండు లేదా మూడు క్వింటాళ్ల కందులు తయారవుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది సాగుకు ప్రకృతి బాగా అనుకూలించినట్లు రైతులు చెబుతున్నారు. మంచి వర్షాలు రావడం వల్ల ప్రస్తుతం కంది పంట బలంగా ఉంది. ఎన్నో ఆశలు నింపుకున్న కంది రైతులకు ప్రకృతి అన్ని విధాల సహకరించాలని ఆశిద్దాం.

కుందూ నదిలో పెరిగిన నీటిమట్టం

ప్రజాశక్తి - చాపాడు

గత రెండు రోజులుగా కుందూ నదిలో నీటిమట్టం పెరిగింది. పది రోజుల క్రితం వరకు కుందూలో చుక్క నీరు లేదు. వారం రోజులుగా ఎగువ ప్రాంతంలో పడిన వర్షానికి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం కుందూ నదిలో రాజోలి ఆనకట్ట నుంచి 7వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శుక్రవారం రాత్రి కుందూనదికి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం నదిలో 7వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. కుందూనది తీర గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. కుందూ నది నీటి ఆధారంగా ఇప్పటికే రైతులు పసుపు పంట సాగు చేపడుతున్నారు. వరి ఇతర పంటలు సాగు చేసే రైతులు సిద్ధమవుతున్నారు.

అభివృద్ధికే పట్టం కట్టారు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియో జకవర్గ ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని టిడిపి యువనేత బొల్లపు ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదినారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు ఎన్నుకోవడం శుభపరిణామమన్నారు. 2004 నుంచి 2019 వరకు ఆదినారాయణ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల రెండింటిని నగర పంచాయతీలుగా మార్చడంలో ఆయన పాత్ర కీలకమైందన్నారు. ప్రతి గ్రామాన్ని కలుపుతూ ఆ రోజుల్లో గ్రావెల్, తారు రోడ్లు వేయించారన్నారు. ప్రతి ఇంటికి దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం, ఎన్నో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని ఆది నారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వేసవి ముగింపు కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. సిరి సంజీవని, ది మిల్లెట్స్ కేఫ్ వారి సౌజన్యంతో మాస్టర్ యువకిషోర్, యువరాజ డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారు సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన చిన్నారుల ఆటపాటలతో ప్రాంగణ మంతా సందడి నెలకొంది. ప్రేక్షకులు చిన్నారులను తమ కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ యువకిషోర్, ప్రకాష్ (సిరి సంజీవని), స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'వరద' ప్రజామన్ననలు పొందాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి ప్రజామన్ననలు పొందాలని ఆటో కార్మికులు కోరారు. ప్రొద్దుటూరు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ సంఘ (టియన్‌టియుసి) నాయకులు ఆదివారం ఆరవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వరదరాజులరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకొని వరద పాలించాలన్నారు. సమాజం నుండి పేదరికం రూపుమాపే విధంగా యత్నించాలన్నారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యాధిక నిరుద్యోగులు అనేక మంది ఉన్నారని, వారికి ఉపాధి కల్పించేలా కృషి చేయాలన్నారు. చాలా మంది విద్యాధికులు వేరే ఉపాధి దొరక్క ఆటో రంగాన్ని ఎంచుకున్నారని, వారి సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ఇందుకు స్పందించిన వరద మాట్లాడుతూ ఆటో కార్మికులు ఈ విధంగా తనను కలవడం సంతోషంగా ఉందన్నారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రహిమాన్ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో జరిగిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ఎస్‌కెఆర్ హాస్పిటల్స్‌లో జరిగిన ఈ వైద్య శిబిరంలో 68 మందికి మదనపల్లికి చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్ఆర్ బాషా ఆధ్వర్యంలో రోగులకు గుండె జబ్బు ప్రాథమిక నిర్ధారణా పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి బిపి, షుగర్, లిపిడ్ ప్రొఫైల్, బ్లడ్ కౌంట్స్, 2డి ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించి వాటి ఫలితాల ఆధారంగా రోగులకు చికిత్స, మందులు అందించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహణపై రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్.కె.ఆర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కెఎం.బాషా, వైద్యులు డాక్టర్ ఎస్‌కెఎం వసీం, డాక్టర్ అస్ఫియా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం బెంగుళూరు ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజీ డైరెక్టర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆ కళాశాల వైద్యులు డాక్టర్లు జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, ఐకేర్, చెవి, ముక్కు, గొంతుచికిత్స, డెర్మటాలజీ, డెంటల్, యూరాలజీ, కార్డియాలజీ, గైనకాలజీకి సంబంధించిన వ్యాధులకు డాక్టర్లు రోగులను వివిధ రకాల పరీక్షలతో వైద్య చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కాలేజీ పిఆర్‌ఒ శంకర్, మలిగిదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఒంటె అదృశ్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండలం,అంగళ్ళు గ్రామానికి చెందిన కొందరు ముస్లిములు బక్రీద్ ఖుర్బానీ నిమిత్తం తెచ్చిన ఒంటె ఆదివారం ఉదయం మూడు గంటల సమయంలో అదృశ్యమైందని తెలిపారు. ఒంటే ఆచూకీ కోసం యజమానులు పలు ప్రాంతాలు గాలించిన ఫలితం లేకపోవడంతో ఎవరైనా పట్టుకెళ్లిపోయారా అనే అనుమానాలకు తావిస్తోంది. కనుక ఎవరికైనా ఒంటె ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కుటుంబం తమను ఎంతో ముందుకు నడిపించిందని అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎన్నడూ మర్చిపోలేను అన్నారు. మల్లయ్య కొండ అభివృద్ధితో పాటు తంబళ్లపల్లి నియోజకవర్గం లోని ఆరు మండలాల్లో పేద ప్రజలకు అండగా ఉంటూ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని గోపి దీన్ని పంచాయతీఉప్పులూరు వాండ్లపల్లి సమీపంలో వెలసిన దిగువ గిండీ గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. కొత్తపల్లి, బల్లాపురంపల్లి, ఉప్పులూరు వాండ్లపల్లి, గోపిదిన్నె, దళితవాడ ప్రజలు ఈ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారులు గిండి ప్రభాకర్, వెంకటేష్ అమ్మవారికి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందిని బండ్ల మెరవాణి భక్తులను అలరింప చేశాయి.

యువత విలియం కేరిని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నేటి యువత విలియం కేరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ కె.సామ్యూల్ బాబు అన్నారు. ఆదివారం విలియం కేరి వర్ధంతిని పురస్కరించుకుని ఆర్‌కె నగర్ లోని షాలేము ప్రార్థనా మందిర లో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలియంకేరి 1761, ఆగస్టు 17న ఇంగ్లండ్ సమీపంలో ఉన్న ఓ కుగ్రామంలో జన్మించారని చెప్పారు. 1775లో భారత దేశానికి క్రైస్తవ మిషనరీగా వచ్చి కలకత్తా వెస్ట్ బెంగాల్‌లోని శ్రీరామంపురం గ్రామంలో విలియం కేరి తన ఆధ్యాత్మిక మిషనరీ జీవితాన్ని ఆరంభించారని చెప్పారు. 1834, జూన్ 9 తేదీన మరణించారని తెలిపారు. కేరి భారత దేశం లోని 45 భాషలను తర్జుమా చేసి బైబిలు గ్రంథాన్ని ముద్రించిన ఘనత ఉందన్నారు. కేరి వృక్ష శాస్త్ర వేత్తగానే గాక వ్యవసాయ రంగంలో కూడా ఘన నీయమైన పేరు ప్రతిష్టలు ఆర్జించారని పేర్కొన్నారు. దేశంలోని మూఢాచారాలను తొలగించే ప్రయత్నం చేయడమే కాకుండా సతీసహగమనం, శిశువు హత్యలు, సాంఘిక దురాచారాలను రూపుమాపిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు. కార్యక్రమం లో రెవ.కె.స్వర్జన్ రత్న కుమార్, రెవ. బిషప్ కె. దానం, కె.ఎస్.రాజకుమారి, ప్రణూష స్పందన హెప్సిబా, వజ్రమ్మ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆత్మహత్యకు పాల్పడ్డ ప్రేమికులు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆత్మహత్యకు పాల్పడ్డ ప్రేమికులు మృతి చెందారు. ఎస్ఐ తిప్పేస్వామి వివరాల మేరకు.. దేవలచెరువుకు చెందిన నరేంద్ర(25) ఎద్దులవారిపల్లెకు చెందిన సి.రాణి(17) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో వారి ప్రేమను ఇరువురి ఇంట్లో ఒప్పుకోలేదు. దీంతో ఆ ప్రేమ జంట శుక్రవారం బత్తలాపురం అడవిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చికిత్స నిమిత్తం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి చేర్పించారు. పరీక్షించిన డాక్టర్లు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందారు. ఈ మేరకు మొలకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వాల్మీకిపురం మండలం నగిరిమడుగు సమీపంలో ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లి మండలం ముష్టూరు పంచాయతీ గౌనివారి పల్లికి చెందిన నరసింహులు(34) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. ఆదివారం ఉదయం మండలం లోని నగిరి మడుగులో బంధువుల ఇంట్లో జరిగిన పండుగకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. మధ్యాహ్నం సొంతూరైన గౌనివారి పల్లికి తిరిగి బయల్దేరగా నగిరిమడుగు సమీపంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొని, వెళ్లిపోవడంతో నరసింహులుకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు హుటాహుటిన 108కి సమాచారం అందించి, వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారని అన్నారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సంఘటనాస్థలంలో పడిఉన్న నరసింహులు